సాక్షి వికారాబాద్

సోమవారం । 26 । ఆగస్టు । 2024



పేదలకు వరం కేజీబీవీ

పేద బాలికలకు కేజీబీవీలు వరంగా మారాయి. చదువుకునే ఆసక్తి ఉంటే చాలు.. అన్ని వసతులు కల్పిస్తున్నారు. 8లో▸



మిషన్ భగీరథకు ఏమైంది?

చుక్కనీరు అందని గ్రామాలకు సైతం మిషన్ భగీరథ పథకంతో పల్లెల దాహార్తి తీర్చారు. 9లో▸



రిజర్వేషన్లు అమలు చేయాలి

ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంఘం నాయకులు బస్వరాజ్, వెంకటయ్య డిమాండ్ చేశారు. 9లో▸

రేపు తాండూరు ఆర్ఎంఓలతో ఫోన్ ఇన్

గ్రామాలు, పట్టణాల్లో విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఫోన్ ఇన్ ద్వారా తాండూరు ప్రభుత ఆస్పత్రి ఆర్ఎంఓ, మాతా శిశు ఆస్పత్రి ఆర్ఎంఓ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు

డాక్టర్లు: ఆనంద్ గోపాల్ రెడ్డి, అనికుమార్‌రెడ్డి

తేదీ: 27-08-2024 (మంగళవారం)

సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు:
99492 61512, 93474 51474

కల్తీ కల్లోలం



వికారాబాద్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పీరంపల్లి గ్రామస్తులను పరామర్శిస్తున్న నేతలు

పెరుగుతున్న బాధితులు

- ఇప్పటికే ఒకరి మృతి.. 60మందికి పైగా బాధితులు
- కల్తీ కల్లు కాదంటున్న ఆబ్కారీ శాఖ
- నీటి కాలుష్యం లేదని తేల్చేసిన మండల పరిషత్ అధికారులు
- కారణాలపై స్పష్టత కరువు

వికారాబాద్: కల్తీ కల్లు కల్లోలం సృష్టిస్తోంది. అస్వస్థతకు గురవుతున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. రెక్కాడితేగాని డొక్కాడని రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వికారాబాద్ మండల పరిధిలోని పీర్లంపల్లి గ్రామంలో కల్తీ కల్లు తాగి ఇప్పటికే ఒకరు మృతి చెందగా 60 మందికి పైగా ఆస్పత్రి పాలయ్యారు. నేతలు, అధికారులు పరామర్శిస్తున్నారే తప్ప వారికి ఆసరగా నిలవడం లేదు. ఈ ఘటనపై ఎక్సైజ్ అధికారులు, మండల పరిషత్ అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ తప్పించుకునే యత్నం చేస్తున్నారే తప్ప కారణాలు తేల్చడం లేదు. ఈ విషయంలో క్షేత్ర స్థాయి అధికారులు, ఉన్నతాధికారులకు సైతం స్పష్టత లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కల్తీ కల్లుతోనే ఘటన జరిగిందని గ్రామస్తులు చెబుతుండగా.. ఆ లక్షణాలు ఏవీ లేవని ఆబ్కారీ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

కలుషిత నీరు కాదని కలెక్టర్‌కు నివేదిక

కల్తీకల్లుతోనే ఘటన జరిగిందనేందుకు ఆధారాలు లేవు.. కలుషిత నీరువల్ల జరిగి ఉండొచ్చని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటుండగా.. పంచాయతీ అధికారులు, వాటిని పర్యవేక్షించే మండల పరిషత్ అధికారులు ఎక్సైజ్ అధికారుల వాదన కొట్టి పారేస్తున్నారు. గ్రామంలో 260 కుటుంబాలుండగా సుమారు 50 కుటుంబాల్లో 60 మంది వరకు ఆస్పత్రి పాలయ్యారు. గ్రామంలో తాగునీటి వనరులన్నింటి నుంచి నీటిని సేకరించి ల్యాబ్‌కు పంపించి టెస్టులు చేయించారు. గ్రామస్తులు తాగుతున్న నీటిలో ఎలాంటి కలుషిత లక్షణాలు లేవని తేలడంతో ఆ రిపోర్టులతో కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఉన్నతాధికారులు సైతం ఘటనకు కారకులు ఎవరు.? కారణాలు ఏమై ఉండొచ్చనేది స్పష్టత ఇవ్వకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజారోగ్యమంటే అధికారులకు ఇంతా చులకనా..? అని ప్రజా సంఘాల నాయకులు మండి పడుతున్నారు.

శాంపిల్లు సేకరించాం: ఆబ్కారీ శాఖ

పీర్లంపల్లి ఘటన నేపథ్యంలో ఆ గ్రామంతో పాటు పక్క గ్రామాల్లో విక్రయించే కల్లు శాంపిల్లు సేకరించి ల్యాబ్‌కు పంపించాం. రిపోర్టుల్లో కల్తీ కల్లు కారణంగానే అస్వస్థకు గురైనట్టు తేలితే కల్లు విక్రయదారులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. కల్తీ కల్లు కారణంగా జరిగిందని నిర్ధారించడానికి కారణాలు, ఆధారాలు లభించలేదు. కలుషిత తాగునీటితో సైతం వాంతులు, విరేచనాలు అవుతాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు. ఇప్పటికే కల్లు విక్రేతపై సైతం కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. గ్రామంలో అనుమతులు లేకుండానే కల్లు దుకాణం ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారని సమాచారం. ఎక్సైజ్ అధికారుల నిఘాలోపంతోనే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రశంసా పత్రాలతో సైక్లోథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

పర్యావరణ కాలుష్యం అరికట్టాలి

- వ్యక్తిగత ఆరోగ్యం అవసరం
- మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి
- మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో సైక్లోథాన్

తాండూరు టౌన్: ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పటోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జాతీయ క్రీడా దినోత్సవం క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాలను పురస్కరించుకు మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో సైక్లోథాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని బాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ విలియం మూన్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. వ్యర్థాల కారణంగా వాతావరణ కాలుష్యం ఏర్పడుతోందన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. కాలుష్య నివారణకు వాహనాల వినియోగం తగ్గించాలని సూచించారు. నిత్యం సైక్లింగ్ చేయడంతో ఆరోగ్యం సైతం మెరుగుపడుతుందన్నారు. అనంతరం డాక్టర్ సమీవుల్లా మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు. మార్వాడీ యువమంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మన్మోహన్ సార్దా మాట్లాడుతూ.. సైకిల్ తొక్కడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గడంతో పాటుగా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా మంచ్ 800 శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సైక్లోథాన్‌లో 2లక్షల మంది పాల్గొన్నారన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సైక్లోథాన్‌లో 150 మంది గంగోత్రి విద్యాలయం విద్యార్థులు, మంచ్ అధ్యక్షుడు అనిల్ సార్దా, కార్యదర్శి సచిన్ రాతి, కోశాధికారి అరుణ్ సార్దా, సభ్యులు కుంజ్ బిహారీ సోని, సన్నీ అగర్వాల్, బ్రిజ్‌మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

మోమిన్‌పేట: మల్లికార్జున స్వామి ఆలయ పాలకవర్గం నియమాకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ నరేందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని దుర్గంచెర్వు గ్రామంలో వెలిసిన మల్లికార్జున స్వామి ఆలయ పాలక వర్గ కమిటీ సభ్యుల నియమాకానికి దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆయన వివరించారు. 20 రోజుల్లోగా దరఖాస్తులు పూర్తి చేసి దేవాదాయ కమిషన్ రంగారెడ్డి జిల్లా వారికి అందించాలని ఆయన సూచించారు.

బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంగమేశ్వర్



సంగమేశ్వర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

మర్పల్లి: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంగమేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆయన స్వగృహంలో ఆదివారం సంగమేశ్వర్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి మాట్లాడుతూ.. బీసీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. తన సేవలను గుర్తించి ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఆర్.కృష్ణయ్యకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్, మల్లేష్, అంజి తదితరులున్నారు.

నేరాలపై నజర్

- ఉక్కుపాదంతో అణచివేస్తాం
- డీసీపీ సునీతా రెడ్డి

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా కొనసాగుతున్న నేరాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తరచూ హత్యలు, హత్యాయత్నాలు జరుగుతుండడం.. గంజాయి సరఫరా లాంటి విషయాలు వెలుగుచూస్తుండడంతో మహేశ్వరం డీసీపీ డి.సునీతా రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం రాయల్ కాలనీలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. అదనపు డీసీపీ బి.వి.సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.భూపతి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డితో పాటు సీఏఆర్ హెడ్ క్వార్టర్స్, ఎస్ఓటీ పోలీసులతో మొత్తం 287 మంది కలిసి ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి ఇంటింటి సోదాలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 63 వాహనాలు, మూడు బాటిళ్ల ఆక్సిటోసిన్ స్టెరాయిడ్ (గేదెలు అధికంగా పాలు ఇచ్చేందుకు వినియోగించే ఉత్ప్రేరకం)లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు రౌడీషీటర్లు, ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యంగా రోహింగ్యా ముస్లిం యువకులకు ఇక్కడి నిబంధనలు పాటిస్తూ నేరాలకు దూరంగా ఉండాలని డీసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇకపై స్టేషన్ పరిధిలో 24 గంటల పాటు పెట్రోలింగ్ కొనసాగిస్తామన్నారు. నేరాలకు పాల్పడే వారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు.



దేవర్‌ఫసల్‌వాద్‌లో నిర్మించిన పాఠశాలను ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పేదల విద్యాభివృద్ధికి సహకారం

'రౌండ్ టేబుల్' చైర్మన్ విషన్‌గుప్తా

దౌల్తాబాద్: పేదల విద్యాభివృద్ధికి తమవంతుగా సాయం అందిస్తామని రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ విషన్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని దేవర్‌ఫసల్‌వాద్‌లో సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.40లక్షలు వెచ్చించి పాఠశాల భవనం, అదనపు తరగతి గదులు, ఫర్నీచర్, మరుగుదొడ్లు నిర్మించారు. ఈ భవనాన్ని వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విషన్‌గుప్తా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు తమ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఎనిమిది పాఠశాలలను నిర్మించామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆదర్శకుమార్, శ్రావణ్‌కుమార్, రాహుల్, స్థానిక నాయకులు వెంకట్రావు, వెంకట్‌రెడ్డి, వెంకట్రాములు, రాజు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి దండిగా దరఖాస్తులు



సహకార బ్యాంకులో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న రైతులు

- అర్జీల స్వీకరణకు రైతువేదిక వద్ద ప్రత్యేక కౌంటర్లు
- అర్హులందరికీ మాఫీ చేస్తామంటున్న అధికారులు

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతలుగా రుణమాఫీ చేసినా ఇంకా లబ్ధి చేకూరని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం జూలై 18న మొదటి విడతలో లక్ష లోపు రుణాలు, జూలై 30న రూ.1.50లక్షల లోపు, ఆగస్టు 15న మూడవ విడతలో రూ.2లక్షల వరకు రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. కానీ జాబితాలో కొంత మంది రైతుల పేర్లు లేకపోవడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

అర్హులందరికీ రుణమాఫీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం మంగళవారం నుంచి రుణమాఫీ అవ్వని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఇప్పటి వరకు దౌల్తాబాద్ మండలం నుంచే 200 వరకు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

మూడు విడతల్లో మాఫీ

కొడంగల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి మొత్తం 18,024 మంది రైతులకు గాను రూ.150.19కోట్లు ప్రభుత్వం మాఫీ చేసింది. అయితే కుటుంబసభ్యులకు రేషన్‌కార్డు లేకపోవడం, ఒకే కుటుంబం నుంచి రూ.2లక్షలు రుణం తీసుకోవడం, కొన్ని బ్యాంకుల్లో ఆధార్‌కార్డు తప్పుగా నమోదు కావడం తదితర కారణాలతో చాలా మంది రైతులకు రుణమాఫీ అందక ఆందోళన చెందుతున్నారు.

పేరులో తేడా ఉంది



ఎస్‌బీఐ బ్యాంకులో రూ.1.15లక్షలు రుణం ఉంది. కానీ మూడు విడతల్లో రుణమాఫీ అవ్వలేదు. అధికారులను అడిగితే ఆధార్‌లో, బ్యాంకు ఖాతాలో పేరు తేడా ఉందని తెలిపారు. రుణమాఫీ కోసం దరఖాస్తు చేశాను.

– ప్రవీణ్ గౌడ్, దౌల్తాబాద్

కౌంటర్లు ఏర్పాటు చేశాం

ప్రభుత్వం రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేసింది. అర్హులుగా ఉండి రుణమాఫీ అవ్వని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు రైతు వేదికల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అక్కడ మాఫీ ఎందుకు అవ్వలేదనేది వివరిస్తారు. సమస్యల ఆధారంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అర్హులందరికీ మాఫీ అవుతుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– శంకర్‌నాయక్, ఏడీఏ, కొడంగల్


దూసుకొచ్చిన మృత్యు శకటం

- బైక్‌ను ఢీకొట్టిన లారీ
- తల్లీకూతుళ్ల దుర్మరణం

కొత్తూరు: మద్యం మత్తులో ఓ లారీ డ్రైవర్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి తల్లీ, కూతుళ్ల మృతికి కారణమయ్యాడు. ఈ విషాదకర సంఘటన కొత్తూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ వద్ద జాతీయ రహదారిపై చేగూరు కూడలిలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం షాద్‌నగర్ పట్టణంలో నివసిస్తున్న సాయికృష్ణ, భార్య కావ్య (25) కూతుళ్లు అనన్య (01), ఐశ్వర్య (03)తో కలిసి ఆదివారం బైకుపై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో తిమ్మాపూర్ వద్ద చేగూరు రోడ్డు కూడలిలోకి రాగానే అదే రూట్‌లో అతి వేగంగా, అజాగ్రత్తగా వెనుక నుంచి వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికృష్ణ, ఆయన పెద్ద కూతురు ఎడమ వైపునకు పడిపోగా భార్య, చిన్న కూతురు అనన్య కుడివైపునకు లారీ చక్రాల కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో తల్లీ కూతుళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ అక్కడితో ఆగకుండా ముందు వెళ్తున్న మరో బైకు, ఆటో, టెంపో ట్రావెలర్‌ను ఢీకొట్టుకుంటూ ముందుకు వెళ్లింది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను పీహెచ్‌సీకి తరలించారు. లారీ డ్రైవర్ మహ్మద్ పాషా మద్యం మత్తులో వాహనాన్ని నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు సీఐ తెలిపారు. సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనెక్షన్.. కలెక్షన్!

కరెంటోళ్లకు కాసులు కురిపిస్తున్న కొత్త కనెక్షన్లు



- ఒక్కో పనికి ఒక్కో రేటు 'ఫిక్స్'
- ఇస్తే సరి లేదంటే ముప్పుతిప్పలు
- తరచూ ఏసీబీకి పట్టుబడుతున్న అధికారులు
- అయినా ఆగని అక్రమ వసూళ్లు

ఏ పనికి ఎంత వసూలు చేస్తున్నారంటే.. (సుమారు)

రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఉన్న ఇంటికి ఒక్కో మీటర్‌కు రూ.**1,500-2,000**

నోటరీ ల్యాండ్/ ఇంటి కనెక్షన్‌కు రూ.**10,000-20,000**

లైన్ షిఫ్టింగ్‌కు రూ.**15,000-20,000**

కొత్తలైను ఏర్పాటుకు రూ.**40,000-50,000**

ప్యానల్‌బోర్డు అనుమతికి రూ.**55,000-60,000**

బహుళ అంతస్తుల భవనానికి 63 కేవీఏ డీటీఆర్ మంజూరుకు రూ.**1,80,000-2,00,000**

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్తలైన్లు, లైన్ షిఫ్టింగ్ పనులు, మీటర్లు, డీటీఆర్‌లు, ప్యానల్ బోర్డులు కరెంటోళ్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. నిబంధనల మేరకు లోడును బట్టి ఫీజులు చెల్లిస్తున్నా.. క్షేత్రస్థాయిలోని ఆర్టిజన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఏఈ, ఏడీఈ, డీఈ ఇలా ఎవరి స్థాయిలో వారికి చేయి తడపనిదే పని కావడం లేదు. నిరాకరించిన వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. అధికారుల తీరుతో విసుగుచెందుతున్న వినియోగదారులు చివరికి ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. తరచూ ఏదో ఒకచోట.. ఎవరో ఒకరు ఏసీబీకి పట్టుబడుతూనే ఉన్నారు. అయినా.. అక్రమార్కుల వైఖరిలో మార్పు రావడం లేదు.

వేతనం బోలెడు.. అయినా వదలరు

వాస్తవానికి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలతో పోలిస్తే డిస్కం ఇంజనీర్ల వేతనాలు చాలా ఎక్కువే. ఒక్కో డీఈకి సీనియార్టీని బట్టి నెలకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతనం చెల్లిస్తుంది. సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్ల వేతనాలు కూడా రూ.లక్షకు పైమాటే. ప్రభుత్వం వీరికి భారీగా వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ.. వీరిలో కొంతమంది అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా ఫోకల్, నాన్ ఫోకల్ అనే పేరుతో పోస్టులను సృష్టించి పోస్టింగ్ కోసం చేసిన ఖర్చులను తిరిగి రాబట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటుపడి అవినీతి నిరోధకశాఖ వలలో చిక్కుతున్నారు. ప్రత్యక్షంగా తమ భవిష్యత్తును పాడు చేసుకుంటూ పరోక్షంగా సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. ఏసీబీకి చిక్కిన వారు ఆ తర్వాత అంతకంటే పెద్ద పోస్టుల్లో చేరుతుండటం గమనార్హం.

దరఖాస్తును బట్టి ధర

ఔటర్‌కు అటు ఇటుగా అనేక బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు వెలుస్తున్నాయి. కొత్త మీటర్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రతి నెలా 2,500 మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరిలో 250 మంది ప్యానల్ బోర్డుల కోసం, వందమంది వరకు డీటీఆర్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. భారీ బహుళ అంతస్తుల భవనాలకు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఫైర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ విభాగాల నుంచి ఎన్ఓసీలు తప్పనిసరి. చాలామంది ఆయా విభాగాల నుంచి అనుమతి తీసుకోకపోవడం, సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపడుతుండడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. ప్యానల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు రూ.రెండు లక్షలకుపైగా, వెంచర్‌లో కొత్తలైన్ల ఏర్పాటుకు రూ.ఐదు లక్షలకుపైగా డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం.

భూదాన్, వక్ఫ్‌బోర్డు, దేవాదాయశాఖ, అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో చేపట్టే నిర్మాణాలు కరెంటోళ్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. అక్రమ వసూళ్లకు పాల్పడి పరోక్షంగా ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి కారణమవుతున్నారు. తాజాగా మంచాల మండలంలోని ఓ వెంచర్‌లో

అక్రమ నిర్మాణాలకు అ'ధనం'గా..

రోడ్డుకు అడ్డుగా ఉన్న 11కేవీ, 33కేవీ లైన్ల మార్పునకు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు సరూర్‌నగర్ సర్కిల్ ఎలక్ట్రికల్ (టెక్నికల్) డివిజనల్ ఇంజనీర్ (డీఈ) టి.రామ్మోహన్ డబ్బు డిమాండ్ చేసి, సదరు కాంట్రాక్టర్ నుంచి తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన విషయం సంచలనం సృష్టించింది.

అక్రమార్కులను ఉపేక్షించబోం

క్షేత్రస్థాయిలోని ఇంజనీర్లు ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం. ఉద్దేశపూర్వకంగా ఫైళ్లను తొక్కిపెట్టి.. సకాలంలో కనెక్షన్లు జారీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించం. అంతర్గత విచారణకు ఆదేశించడంతో పాటు పదోన్నతులు, పోస్టింగ్‌లు నిలిపివేస్తాం. భవిష్యత్తులో వారికి సంస్థ నుంచి రావాల్సిన బెనిఫిట్స్ విషయంలోనూ కోత విధిస్తాం.

– ముషారఫ్ ఫారూఖీ, సీఎండీ, టీజీఎస్పీడీసీఎల్

పేదలకు వరం కేజీబీవీ

- నాణ్యమైన విద్యే లక్ష్యంగా బోధన
- విద్యార్థినులకు కరాటేలో శిక్షణ
- పాఠశాలల చుట్టూ సీసీ కెమెరాల నిఘా
- ఆహ్లాదకరమైన వాతావరణంలో తరగతులు


చెట్టుపల్లి తండాలో నిర్వహిస్తున్న విద్యాలయం

దుద్యాల్: నిరుపేద బాలికలకు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు వరంగా మారాయి. చదువుకోవాలని ఆసక్తి ఉండాలే కాని ఇక్కడ మౌలికవసతుల కల్పనకు కొదవ లేదు. చదివించే స్థోమత లేని ఎంతో మందికి ఈ విద్యాలయం దేవాలయం. ఇక్కడ ప్రవేశానికి అనాథ బాలికలకు ప్రాధాన్యం ఉంటుంది. తల్లి ఉండి తండ్రిలేని వారికి, తండ్రి ఉండి తల్లిలేని బాలికలకు ప్రాముఖ్యత ఇస్తారు.

సౌకర్యాల కల్పన

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుంది. చదువుకు ఆటంకం ఎదురుకాకుండా చర్యలు చేపడుతుంది. చదువుకోవాలనే ఆసక్తి ఉండి ఆర్థిక స్తోమత లేని విద్యార్థినులకు ఈ విద్యాలయాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రతీరోజు మెనూ ప్రకారం శాఖహార, మాంసహార భోజనం అందిస్తున్నారు. అంతేకాక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థినులు చదువులకే పరిమితం కాకుండా ఆరోగ్య భద్రతకు యోగా, ఆత్మరక్షణకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు.

అడ్మిషన్లకు కొదువ లేదు

ఎన్నోసౌకర్యాలు, భద్రత కల్పిస్తుండడంతో కేజీబీవీ పాఠశాలలో ప్రతీ సంవత్సరం ఆరోతరగతిలో అడ్మిషన్లకోసం నోటిఫికేషన్ ఇచ్చి వారం రోజుల్లోపే భర్తీ చేస్తున్నారు. తల్లి దండ్రులు లేని పిల్లలు ఈ విద్యాలయాల్లో చేరుతున్నారు. దీంతో అడ్మిషన్లు చాలా వేగంగా పూర్తి చేస్తున్నారు. వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్నా బ్యాక్‌లాగ్ సీట్లను పాఠశాల ప్రారంభమైన 10 రోజుల్లోపే అధికారులు భర్తీ చేస్తున్నారు.

దుద్యాల్‌లో గిరిజనులే ఎక్కువ

దుద్యాల్ మండలంలో తండాలు అధికంగా ఉండడంతో గిరిజనులే ఎక్కువ సంఖ్యలో చేరుతున్నారు. మండలంలోని చెట్టుపల్లి తండా శివారులో కస్తూరిబా గాంధీ గిరిజన బాలికల విద్యాలయం ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. ఇక్కడ గిరిజన బాలికలే కాకుండా అన్ని కులాలకు చెందిన నిరుపేదలకు ప్రవేశం ఉంటుందని ప్రత్యేక అధికారి రాధిక చెబుతున్నారు. ఈ విద్యాలయంలో 250 మంది విద్యార్థులు ఉనట్లు పేర్కొన్నారు.


ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థినులు (ఫైల్)


కరాటేలో భాగంగా చేతిపై నుంచి బైక్ వెళ్లే స్టంట్ చేస్తున్న బాలికలు


యోగాసానాలు వేసిన విద్యార్థినులు

సద్వినియోగం చేసుకోవాలి



పేద బాలికలు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం విద్యార్థులకు సకల వసతులు కల్పించడంతో పాటు ప్రతీ విద్యార్థిని చదువులో రాణించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే కస్తూరిబా పాఠశాలలో దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. ఆసక్తి ఉన్న బాలికలు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవచ్చు.

– రాధిక, ప్రత్యేక అధికారి, కేజీబీవీ, చెట్టుపల్లి తండా

తల్లిదండ్రులు లేరనే ఆలోచనే రాదు



మాది కర్ణాటక, రంజోలి గ్రామం. మా అమ్మ నాన్న చిన్నతనంలో చనిపోయారు. బొంరాస్‌పేట మండలం రేగడి మైల్వార్ గ్రామంలో బంధువుల వద్ద ఉండేదాన్ని. వారి సహకారంతో ఆరోతరగతిలో చేరాను. ప్రస్తుతం నేను పదోతరగతి చదువుతున్నాను. నాలుగు సంవత్సరాలుగా నాకు ఉపాధ్యాయులు అన్ని విధాలుగా సహకరిస్తున్నారు. తల్లి దండ్రులు లేరనే ఆలోచనే రానివ్వరు.

– తనూజ, పదోతరగతి, కేజీబీవీ, చెట్టుపల్లి తండా

అమ్మకు భారం కాకుడదని....



నాలుగు సంవత్సరాల క్రితం నాన్న చనిపోవడంతో అమ్మ, నేను అనాథలయ్యాం. చదువుకోవాలనే పట్టుదల ఉండడంతో అమ్మకు భారం కాకూడదని చేరాను. ఇక్కడ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులే మాకు తల్లిదండ్రులు. వారి సహకారం మరువలేం. ఇంటి దగ్గర లేని వసతులు కూడా ఇక్కడ కల్పిస్తున్నారు.

– శ్రావణి, పదోతరగతి, కేజీబీవీ, చెట్టుపల్లి తండా

ఏపీజే అబ్దుల్ కలాం అవార్డుకు ఎంపిక

పరిగి: మిట్టకోడూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న యండీ ఉస్మాన్ అలీ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. తెలుగు భాషలో విద్యార్థుల కోసం 'చిన్నారి బడి' అనే పుస్తకంతో పాటు పలు రచనలు చేయడంతో ఆయనను ఎంపిక చేశారు. 2024 సంవత్సరానికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేస్తున్నట్టు బహుజన సాహిత్య అకాడమీ అవార్డుల కమిటీ ప్రకటించింది. సెప్టెంబర్ 5న తిరుపతిలో నిర్వహించనున్న సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ప్రదానం చేస్తారని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక..

వృద్ధురాలి ఆత్మహత్య

తాండూరు రూరల్: కడుపునొప్పి భరించలేక ఓ వృద్ధురాలు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్ రెడ్డి కథనం ప్రకారం...రాంపూర్ గ్రామానికి చెందిన మాల సైదమ్మ(65) వృద్ధురాలు. ఇంటివద్దే ఉంటుంది. కొంత కాలంగా సైదమ్మ మతిస్థిమితంతో పాటు కడుపునొప్పితో బాధపడుతుంది. ఆదివారం ఉదయం కడుపునొప్పి ఎక్కువవ్వడంతో భరించలేక సైదమ్మ ఇంట్లో పురుగుల మందు తాగింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు, స్థానికులు ఆమెను తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కొడుకు మాల గోపాల్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

'స్వయం ఉపాధితో రాణించాలి'


ఫ్లెక్సీ ప్రింటింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: యువత స్వయం ఉపాధితో రాణించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని రాములు అనే వ్యక్తికి చెందిన ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రెస్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధిని ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాటన్‌పల్లి అంజిలయ్య, కృష్ణయ్య, వెంకటేశ్, నర్సింహా రెడ్డి, వెంకటయ్య, రాజు, శ్రీను, హన్మంతు, రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో గేదెకు రెండు దూడలు

- కృత్రిమ గర్భధారణతో జననం
- గంట తరువాత ఒకటి మృతి


రెండు దూడలకు జన్మనిచ్చిన గేదె

బషీరాబాద్: కృత్రిమ గర్భధారణతో ఓ గేదెకు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఈ ఘటన బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహిళా రైతు తాండ్ర సావిత్రమ్మ తన గేదెకు గోపాల మిత్ర సహకారంతో కొన్ని నెలల క్రితం కృత్రిమ గర్భధారణ టీకా వేయించారు. ముర్ర జాతికి చెందిన పాలిచ్చే దూడలకు జన్మనివ్వడంతో ఆ రైతు మురిసి పోయారు. అయితే కాళ్లతో పుట్టడం ద్వారా ఒకటి గంటతర్వాత చనిపోయిందని గోపాల మిత్ర బసప్ప తెలిపారు.

అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ప్రదీప్ ఎంపిక


ప్రదీప్‌కి ఎంపిక పత్రం అందజేస్తున్న రాధాకృష్ణ

చేవెళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు మండలంలోని ఇబ్రహీంపల్లి గ్రామానికి ఎ.ప్రదీప్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) కార్యాలయంలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ప్రకటించారు. అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న ప్రదీప్ సేవలను గుర్తించి అవార్డు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ.. మహనీయులు చూపించిన మార్గాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయన్నారు. బాబాసాహెబ్ ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏటా వివిధ రంగాల్లో సేవలందించిన వారిని ఎంపిక చేసి ఈ అవార్డులు ఇస్తారన్నారు. వీటిని సెప్టెంబర్‌లో తిరుపతిలో ప్రదానం చేస్తారన్నారు. ఈ మేరకు ప్రదీప్‌ను గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ మధుసుదన్‌రెడ్డి, పలువురు నాయకులు అభినందించారు.

నేడు గోకులాష్టమి వేడుకలు

షాద్‌నగర్‌రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో గల సాయిరాజా ఫంక్షన్‌హాల్‌లో బాలగోకుల సమితి ఆధ్వర్యంలో నేడు(సోమవారం) గోకులాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నామని ఆదివారం సమితి చైర్మన్ శ్రీవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతాయని, చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇస్తామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ప్రతి చిన్నారికి ప్రశంసపత్రం, ప్రోత్సాహక బహుమతులను అందిస్తామన్నారు. చిన్నారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసేవిధంగా తల్లి తండ్రులు చొరవ తీసుకోవాలని కోరారు.

మతిస్థిమితం లేని మహిళ హల్‌చల్

- చీకటిపడిన తర్వాత ఓ ఇంట్లోకి చొరపడిన మహిళ
- దొంగగా భావించి పోలీసులకు పట్టించిన గ్రామస్థులు


గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జనం

దుద్యాల్: మతిస్థిమితం లేని ఓ మహిళ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి హల్‌చల్ చేసింది. దుద్యాల గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యాహ్న సమయంలో మతిస్థిమితం లేని మహిళగా గ్రామానికి చేరుకుంది. అక్కడే ఓ ఇంట్లో అడుకున్ని ఆహారం తీసుకుంది. తరువాత ఎవరికీ కనిపించకుండ వెళ్లింది. రాత్రి 8గంటల సమయంలో ఓ ఇంట్లో ప్రవేశించడంతో వాళ్ల భయంతో అరిచారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామస్థులు గుమిగూడి ఆమెను చితకబాదారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంచి పోలీసులకు సమాచారం చేరవేశారు. ఘటనా స్థలానికి చేరుకుని విచారించగా ఆమె నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో ఆమెను మతిస్థిమితం లేని మహిళగా భావించి పోలీసుల సహకారంతో గ్రామస్థులు కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించిన వెంటనే సమాచారం ఇవ్వాలని బొంరాస్‌పేట పోలీసులు గ్రామస్థులకు తెలిపారు.

దాదాపూర్ మాజీ సర్పంచ్ మృతి


అనంతమ్మ (ఫైల్)

దోమ: అనారోగ్యంతో దాదాపూర్ మాజీ సర్పంచ్ అనంతమ్మ (80) ఆదివారం తుది శ్వాస విడిచారు. గ్రామంలో ప్రజలకు విశేష సేవలందించిన ఆమె అకాల మరణం పొందడం పట్ల గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె సేవలను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యాంతమయ్యారు. ఆమె అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు సాయంత్రం నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. పలువురు రాజకీయ నేతలు ఆమె మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానూభుతి తెలిపారు.

బ్యాటరీల చోరీ

తలకొండపల్లి: వాహనాల్లో ఉన్న బ్యాటరీలను దుండగులు అపహరించిన సంఘటన మండల పరిధిలోని చుక్కాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌లో ఒక బ్యాటరీ, గండికోట వెంకటయ్యకు చెందిన ఒక బ్యాటరీతో పాటు పలువురికి చెందిన ఆరు బ్యాటరీలను దుండగులు చోరీ చేశారు. వీటి విలువ రూ.లక్షకు పైమాటే ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

రిజర్వేషన్ల కల్పనకు మండల్ కృషి

- షాబాద్‌లో బీపీ మండల్ జయంత్యుత్సవం


మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

షాబాద్: వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్ కల్పించేందుకు బాబు బింధేశ్వరి ప్రసాద్ మండల్ ఎంతో కృషి చేశారని బీసీ సేనజాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, తెలంగాణ ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింహులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీపీ మండల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాలకు సంబంధించిన విధానాలపై ఆయన చేసిన సేవలను కొనియాడారు. భారత రాజకీయాల్లో తక్కువ ప్రాతినిధ్యం లేని, వెనుకబడిన వర్గాలకు సంబంధించిన విధానాలపై తీవ్ర చర్చను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం మండల అధ్యక్షుడు పాండు, కోశాధికారి జంగయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, తెలంగాణ చైతన్య సమితి ఉపాధ్యక్షుడు విఠలయ్య, బీసీ సేన రాష్ట్ర కార్యదర్శి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటాం


నగదు సాయం చేస్తున్న దాతలు

షాబాద్: పేద కుటుంబాలను ఆదుకునేందుకు తమవంతు కృషి చేస్తామని షాబాద్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ చాంద్‌పాషా పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన దాసరి జంగమ్మ కూతురు పెళ్లికి చాంద్‌పాషా తనవంతు సాయంగా రూ.11వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తనవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు గ్రామంలో మొత్తం 42 మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ.11వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూద యాదయ్య, గ్రామ మాజీ సర్పంచ్‌లు పెద్దజంగని దర్శన్, ర్యాకల శేఖర్, గ్రామస్తులు రాజుగౌడ్, గోపాల్, ఆంజనేయులు, సాయిలు, గ్రామస్తులు ఉన్నారు.


ఫొటోలు దిగుతూ పర్యాటకుల సందడి

పర్యాటకం..ఆహ్లాదం

కోట్‌పల్లి ప్రాజెక్టు తీరాన సరదాగా..

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు పర్యాటకులను ఆహ్లాదపర్చింది. ఓ వైపు పచ్చని పొలాలు, మరో వైపు మూడు వైపుల విస్తరించిన అడవి అందాలు చూస్తూ పర్యాటకులు మైమరిచిపోయారు. ఆదివారం కుటుంబాలతో తల్లిదండ్రులు, చిన్నారులు, యువతీ, యువకులు ప్రాజెక్టును చేరుకుని సరదాగా గడిపారు. ప్రాజెక్టు నీటిలో చిన్నారులు ఆటలతో కేరింతలు కొట్టారు. యువతీ, యువకులు ఆటలాడి ఫొటోలు తీసుకున్నారు. చిన్నపిల్లలు నీటిలో వినూత్నంగా ఆడుతూ సేదతీరారు.


ప్రాజెక్టు నీటిలో ఆడుకుంటున్న చిన్నారులు


యువతీ, యువకుల కేరింతలు

ఆర్అండ్‌బీ రహదారికి అడుగులు

- వెంకటాపూర్–చందానగర్ రోడ్డును సర్వే చేసిన అధికారులు
- స్థానిక నేతల వినతికి స్పందించిన మంత్రి కోమటిరెడ్డి


రోడ్డును పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

మొయినాబాద్: గ్రామీణ రోడ్డును ఆర్అండ్‌బీ రహదారిగా మార్చేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. మండల పరిధిలోని వెంకటాపూర్–చందానగర్ దారిని ఆర్అండ్‌బీ రోడ్డుగా మార్చేందుకు ఆదివారం అధికారులు సర్వే చేపట్టారు. శనివారం మొయినాబాద్ మండలానికి వచ్చిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి స్థానిక నాయకులు వినతిపత్రం అందజేశారు. శంషాబాద్-షాబాద్ రోడ్డులోని కవేలిగూడ నుంచి వెంకటాపూర్, శ్రీరాంనగర్, సురంగల్, మొయినాబాద్, పెద్దమంగళారం గ్రామాల మీదుగా హిమాయత్ నగర్–తంగడ్‌పల్లి రోడ్డులోని చందానగర్ గేటు వరకు ఉన్న పంచాయతీరాజ్ రహదారిని ఆర్అండ్‌బీ రోడ్డుగా మార్చాలని స్థానిక నాయకులు మంత్రికి విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి కోమటిరెడ్డి రోడ్డును పరిశీలించి సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆదివారం ఆర్అండ్‌బీ ఎస్‌ఈ వెంకటేశ్వరావు, జేసీ చంద్రశేఖర్ మొయినాబాద్‌కు వచ్చారు. వెంకటాపూర్ చౌరస్తా నుంచి చందానగర్ చౌరస్తా వరకు 16 కిలోమీటర్లు సర్వే నిర్వహించారు. మంత్రి కోమటిరెడ్డి వెంటనే స్పందించి రోడ్డు సర్వే చేయించడంతో స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ అధికారుల వెంట పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు రాంరెడ్డి, మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, విజయ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు నిధుల గండం

జీపీలకు నిలిచిన కేంద్ర, రాష్ట్ర ఫండ్స్

- ఆరు నెలల నుంచి ప్రత్యేక అధికారుల పాలన
- అప్పులు చేసి పనులు చేయిస్తున్న కార్యదర్శులు
- బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు



సర్దార్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

షాబాద్: నిధులు లేక గ్రామ పంచాయతీల పాలన ఇబ్బందుల్లో పడింది. గత ఫిబ్రవరి నుంచి పంచాయతీల్లో పాలక వర్గాల కాల పరిమితి పూర్తయి ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లింది. ఎన్నికలు నిర్వహించక ఆరు నెలలు దాటడంతో కేంద్ర నిధులు నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు ఇవ్వకపోవడంతో పంచాయతీల్లో చిన్న పాటి బల్బులు వేయాలన్నా, పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నా కార్యదర్శులే సొంతంగా డబ్బులు పెట్టుకోవాల్సి పరిస్థితి నెలకొంది. ఆరు నెలలుగా ఒక్కో కార్యదర్శి పంచాయతీ సామర్థ్యాన్ని బట్టి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో జిల్లాలో 558 గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆరు నెలలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆగిన ఆర్థిక సంఘం నిధులు

పంచాయతీల పాలక వర్గాల కాలపరిమితి ఫిబ్రవరి 2తో పూర్తయింది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచే ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధుల మంజూరుకు చొరవ చూపలేదు. కేంద్ర నిధులు రావాలంటే గ్రామ పంచాయతీలకు పాలక వర్గాలుండాలి. ఆరు మాసాల నుంచి ప్రత్యేక అధికారుల పాలన కారణంగా రెండు ప్రభుత్వాల ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు.

సొంత డబ్బులతో పారిశుద్ధ్యం

గ్రామాల్లో సర్పంచ్‌లు ఉన్నప్పుడు నిధులు రాకున్నా సొంతంగా డబ్బులు వెచ్చించి పారిశుద్ధ్య, వీధి దీపాలు ఇతర పనులు చేయించేవారు. కానీ ప్రత్యేక అధికారుల పాలన రావడంతో కార్యదర్శులే ఆయా పనులకు సొంతంగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. బిల్లులు రాకపోవడంతో కార్యదర్శులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

సర్పంచులదీ అదేపరిస్థితి

గత పాలకవర్గానికి సంబంధించిన సర్పంచ్‌లు అప్పటి ప్రభుత్వం చేపట్టిన వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, హరితహారం మొక్కలు తర్వాత క్రీడా ప్రాంగణాలు తదితర పనులు చేపట్టారు. వాటి బిల్లులు సక్రమంగా రావడం లేదని కాంట్రాక్టర్లు రాని చోట సర్పంచ్‌లే సొంతంగా పనులు చేయించారు. చాలా మంది సర్పంచులు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వెచ్చించారు. ఆ బిల్లులు కూడా ఇప్పటి వరకు రాలేదని వాపోతున్నారు.

అన్నీ సమస్యలే



ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు ఎక్కువయ్యాయి. తాగు నీరు సరిగ్గా రావడం లేదు. ఎల్‌ఈడీ లైట్లు మరమ్మతు చేయించకుండా చిన్నచిన్న బల్బులు వేస్తున్నారు. ఇదేంటని అధికారులను అడిగితే నిధుల కొరత అని చెబుతున్నారు.

– మహేశ్, కుర్వగూడ, షాబాద్

పట్టించుకోవడం లేదు



ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. మా వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. షాబాద్‌లో చెత్త ట్రాక్టర్ మూడు రోజులకు ఒకసారి వస్తుంది. దోమల నివారణకు మందులు పిచికారీ చేయడం లేదు.

– రవీందర్‌గౌడ్, షాబాద్

బిల్లులు పెండింగ్



గ్రామ అభివృద్ధికి ఐదేళ్లలో రూ.5 లక్షల నిధులు ఖర్చు చేశా. ఈ నిధులను అంగన్‌వాడీ భవనం, డ్రైనేజీ నిర్మాణం, రహదారుల ఏర్పాటు, క్రీడా ప్రాంగణం, విద్యుత్ బిల్లుల చెల్లింపునకు వినియోగించాను. బిల్లులు పెండిగ్‌లో ఉన్నాయి.

– రాములు, మాజీ సర్పంచ్, రేగడిదోస్వాడ

అవస్థలు పడుతున్నాం



సర్దార్‌నగర్ గ్రామంలో అభివృద్ధి కోసం రూ.20 లక్షలు అప్పు చేసి ఖర్చు చేశా. ఈ డబ్బుతో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి ఖర్చు చేశా, పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావొస్తున్నా పెండింగ్ బిల్లులు రావడం లేదు.

– స్వరూప, మాజీ సర్పంచ్, సర్దార్‌నగర్